# పేకమేడ

[కథానిక]

= శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు =

సాయంత్ర మయింది. అప్పన్న ఆలోచిస్తూ ఇంటికి నడుస్తున్నాడు. విశాలమైన తెల్లటి ఇసుక దిబ్బలు. తాచుపాములా ఏరు. ఏటి నీరులో తళతళ మెరిసే పడమటి అరుణకాంతులు... చల్లగాలికి ఎడ్లు గంతులు వేస్తూ పరుగిడుతున్నాయి. ఈ సౌందర్య దృశ్యం అప్పన్నకేమి వింతగాలేదు. ఆనందంగాలేదు. ఆ సౌందర్యంగూర్చి ఎప్పుడూ ఆలోచించనేలేదు.

చీకటి పడింది. ఎడ్లని సాలలో కట్టేసి, ఎండుగడ్డి పడేసి, వాకిట్లో నులక మంచం మీద నడుం వాల్చేడు. ఆరోజు పేరయ్యను చూసిన దగ్గరనుంచి తనమతి పోతోంది. తన కళ్ల ముందు పుట్టిపెరిగిన పేరయ్య, ఎడ్లని పొలాన్ని కూడా అమ్ముకొని; ఇంటో గిన్నెలు తాకట్టు పెట్టుకొని బతికినవాడు — ఎలాగయ్యాడు! తన దగ్గిర ఒకటి రెండు సార్లు జొన్నగింజలు అడుక్కు పట్టుకెళ్లేడు! ఇప్పుడో! అబ్బో! ఎఱ్ఱసిల్కులాల్చీ, మల్లు పంచ, పట్టువాణీ,—చూసి పలకరిస్తే పలక్కుండా ముఖం తిప్పేశాడు. నాలుగురాళ్లు చేతిలోపడితే అంతే. ఒక్కొక్కడి అదృష్టం. తనకి ఏభైఏళ్లు పైబడ్డాయి. ఎన్నాళ్లయి ప్రయత్నం చేస్తున్నాడు మంచి మిద్దెఇల్లు కట్టిద్దామని - వెధవ సొద! ఎప్పటికప్పుడే అలా అయిపోతోంది. పొలం సరిగ్గా పండదు. సరియైన నీటివసతి ఉంటేనా? కర్చులు,— సిస్తులు, బకాయిలు, సరిగ్గా తిండికేనా మిగలదు - ఇంక ఇల్లెలా కట్టించడం - ఇప్పుడున్న పూరిల్లు అప్పుడే నాలుగుసార్లు కాలింది. బోలెడు సంసారం, కాలింది - ఎప్పటికప్పుడే మిద్దెల్లు కట్టిద్దామంటే చేతిలో దమ్మిడీలేదు. డబ్బు ఎలా సంపాదించాలో తెలీకుండా ఉంది. లాటరీలో సంపాదించినట్టు ఎంతలో ఆర్జించాడు పేరయ్యగాడు - వాడిపాటి జ్ఞానమైనా లేదు.

బాగా చీకటి పడింది. చల్లటిగాలి వేస్తోంది - లచ్చి మంచం పక్కగా నిలబడి కాళ్ల మీద తట్టి లేపింది. అప్పన్న త్రుళ్లి పడి లేచేడు.

“ఏటలా తొంగున్నావ్. కూడుతినవేటి ?”

అప్పన్న మాట్లాడకుండా లేచి, చూరు కిందనుంచి వొరిగి గదిలోకెళ్లి గెన్నెముందు గొంతికిళ్లా కూర్చున్నాడు. పిల్ల లిద్దరూ పుయ్యాల్లా ఉన్న నులక మంచంమీద నిశ్శబ్దంగా పడుకుని నిద్రపోతున్నారు. పెద్ద పిల్ల సూరి చెయ్యి పైడితల్లిగాడి జుత్తుమీద ఉంది. నిద్దట్లో కాలు వాడి కాళ్ల మీద పడేసింది.

వాళ్ల వేపు అప్పన్న కొంచెంసేపు చూసేడు, లచ్చి దాకలో అన్నం, పులుసూ గిన్నెలో గుమ్మరించింది. లచ్చి భర్త ముఖంలోకి చూసింది.

"ఏటలాగున్నా వియ్యాల ?"

"ఏటీనేదు."

"పులుసెలాగుండేటి "

"రెయ్యి లెక్కడివి ?"

"పేరయ్య తల్లి దుకాణవెట్టిందికాదా?"

"దొంగనంజాకొడుకు"

లచ్చి గతుక్కుమంది - భయంగా అప్పన్న ఎఱ్ఱటి కళ్లల్లోకి చూసింది.

"న్యాయంగాపోతే కూడునేదే"

"ఏమైందేటి"

"ఆడికి పొగరెక్కింది. పలకరిత్తే ముఖం తిప్పేసినాడు."

లచ్చి దాకలో మిగిలిన పులుసంతా గుమ్మరించింది. లచ్చికట్టుకున్న చిరిగిన చీర లోంచి ఆమెశరీరం కనుపిస్తోంది. పిల్లలు గుడ్డలు లేకుండా నిద్రపోతున్నారు. ఆలోచిస్తూ ముద్ద నోట్లో వేసుకున్నాడు. తన దరిద్రంగూర్చి ఆలోచించడానికి కారణం పేరయ్యగాడి ఐశ్వర్యం - వాడు తనకంటె నీచస్థితిలో ఉండేవాడు. ఇప్పుడు పెద్దవాడయ్యేడు. అప్పటికి, ఎప్పటికీ తను అలాగే ఉన్నాడు.

వొంటికింత వొాయసొచ్చింది. మంచి ఇల్లు నేదు. గుడ్డనేదు. తిండినేదు-ఎందుకొచ్చిన బతుకు లచ్చీ."

"చాల్లెద్దు. బగమంతు డింతిస్తె అంతే సాలు - మొదటికాడినుంచి లేన్ది ఇప్పుడొస్తాదేటి. పెంకిటిల్లు కట్టిగలమా సరుకులు సేయించుకోగలమా"

"ఎందుకు సేయించుకోనేం - మొన్న మొన్నటిదాక అడుక్కుతిన్న పేరయ్య కట్టించినాడు పెంకిటిల్లు - బంగారం కడియం సేయించినాడు-సిలుకునాల్చీ-మల్లుపంచ—"

"ఎవడికో ఒకడి కబ్బుతాదిసిరి - ఆతల్లి మాలక్ష్మి, పతీయింటి కొత్తాదేటి-మోతుబరి సీతన్న కేనేదు పెంకిటిల్లు—"

"సీతన్న కేటుంది. మోతుబరైతేసరా."

"నచ్చీ, ఈదినాల్లో ఎవసాయంలో నాబం లేదు. ఏపారంసేసి సంపాదించాల. పేరయ్యగాడు చూడు."

"ఆడికబ్బింది సిరి. మొదట్లో గారె లమ్ముకొనేవాడు"

"అదికాదే. యుద్ధం రాగానే సింత పండుకొని దాసేసినాడు. బియ్యంకొని దాసేసినాడు. మంచిదర రాగానే అమ్మేసినాడు. పట్నంలో మార్వాడికాడ సూసి నేర్చినాడీ ఏపారం - ఇప్పుడేటి మనిసికోద రమ్ముతాడు—"

"అన్నేయంసేసి సంపాదించినసొమ్ము ఎంతకాలముంటదిలే"

అప్పన్న కేమీ తోచలేదు. తనుకూడా వ్యాపారం చేసిఉంటే ఎంతబాగుణ్ణు - ఈ వ్యవసాయంలో కాసీ ఉండదు. న్యాయానికి రోజులు కావివి.

"ఒకపొలం సెక్క అమ్మేసి మనం కూడ ఏపారం సేత్తే బాగుణ్ణే"

"ఏటో పొలం సెక్కమ్మకుంటే ఏటి నాబం అయినా మన కదికులవురితికాదు. మన కెవసాయమే రాసినాడు దేవుడు - పెద్ద పరుగుల కెందుకు పోవాల."

"నచ్చి నీకు ఎవ్వారగ్యానం నేదే."

అప్పన్న చాలా తెలివైనవాడే - ఈ ఏడాది వేరుసెనగ అమ్మకంలో ఊళ్లో వాళ్లంతా పేరయ్యగాడి టోపీలో పడ్డారు. కాని తనమాత్రం, పెద్దదర ఇచ్చే మార్వాడికే అమ్మేడు. ఈ విషయం పేరయ్యగాడు మరచిపోలేదు.

అప్పన్న లేచి చెయ్యి కడుక్కున్నాడు. మళ్లీ మంచంమీద నడుం వాల్చేడు. ఆకాశంలో చుక్కల్లా అప్పన్న బుర్రలో భావాలు మిలమిల మెరుస్తున్నాయి. పొలం అమ్ముకుంటే లాభంలేదు. యుద్ధపురోజుల్లో అందరూ పొలాలు కొంటూంటే తను అమ్మడం మంచి పనికాదు. కాని ఎలాగైనా వ్యాపారం చేస్తేగాని లాభంలేదు. ఎంతకాలం, ఈ పూరి ఇంట్లో ఉండడం? ఒక్కనాడైనా తను గాని పిల్లలుగాని కడుపునిండా ఇంత తినలేదు. తాగలేదు. తనకి పాగ గుడ్డైనా లేదు. ఎంతకాలం ఇలాగ? డబ్బుకావాలి! వ్యాపారానికి మదుపుండాలి! ఆ, జ్ఞాపక మొచ్చింది. వేరుసెనగమీద వచ్చిన ఏభై రూపాలూ ఉన్నాయి. పంట అమ్మి రెండు రోజులే అయింది. ఈ ఏభై రూపాయలూ పెట్టి చిన్న కిరాని కొట్టుపెట్టాలి. లచ్చిగాని, పెద్ద పిల్ల కాని దుకాణంమీద కూర్చోవచ్చు. దుకాణంమీద ఆముదం, నూనె పెడితే మంచి లాభ మొస్తుంది. ఒక సంవత్సరం పాటు నడిచేక చూడుదాని మజా. పేరయ్య గాడేం కట్టించాడు ఇల్లు - వాడింటి కెదురుగుండా డాబాయిల్లు కట్టించాలి.

చాలా రాత్రివరకూ నిద్దరపట్టలేదు. నిద్దర పట్టకపట్టింది. కలత నిద్రలో పేరయ్య పకపక నవ్వుతూ కనిపించేడు. నేరడుకాయలాంటి ముఖంలోంచి తెల్లటి పాముకోరల్లాంటి పళ్లు - నుదుటిమీద కానీ అంత మచ్చ-బూజులా జుత్తు - బానంతకడుపు - చిన్న పిల్లలు చూస్తే జడుసుకుంటారు - ఇంకా నవ్వుతున్నాడు. అప్పన్నవొళ్లు మండింది.

నోరు ముయ్యరా- అన్నేయంగా డబ్బు గుంజేసినావు. ఏరుసెనగ ఎవ్వారం దగ్గర రైతోళ్ల నెంత అన్నేయం సేసేవో ఎవరికి తెల్దు ? చూడు నేసేత్తా ఏపారం. నువ్వేటి కట్టించినావిల్లు — నేకట్టిస్తాసూడు. నువ్వేటి కొన్నావు గేదల్ని - నే కొంటా సూడు. నీకంత పొగరా ? నువ్వెలా బతికినావో ఎవరికి తెల్దు?"

పేరయ్య పకపక నవ్వి వెళ్లిపోయాడు.

బల్లమీద వొచ్చాయి ఆముదపు డబ్బాలు - నూనె డబ్బాలు. ఎంత పెద్ద వ్యాపారమయిం దప్పుడే!

పెద్దమేడ. లచ్చి కూర్చుని పిల్లకి పాలిస్తోంది. ఏంభాగ్యం! ఎవరో దుకాణం పక్కనుంచి మాట్లాడుకుంటూ పోతున్నారు. కిటికిలోంచి

వినబడుతున్నాయి. 'అప్పన్న అన్యాయంచేసి ఆర్జించాడురా! ఎంతకాల ముంటుందిలే!' గుండెలు దడదడ కొట్టుకున్నాయి. కానీ నన్నెవరేం చెయ్యగలరు. డబ్బున్నవాడికి దెయ్యం కూడా లొంగుతుంది. ప్రపంచంలో కూనీలు కుట్రలు, కేసులు, తగాదాలు, ఎన్నివచ్చినా ధనవంతుణ్ణి ఏం చెరపలేవు. అప్పన్న పకపక నవ్వేడు.

"పొద్దెక్కి-పోయిం దియాల - ఇంకా తొంగున్నావేం."

"రాతిరి సరిగ్గా కునుకేనేదు."

"పొలం కెళ్లవా"

"ఎల్తా. ఎవరావాకిట్లో"

"సర్కారు జమాను - సముద్రా రొచ్చినాడట - రమ్మన్నారు కరణంబుగతి-"

అప్పన్న నిర్ఘాంతపోయాడు. తన ఎనభై రూపాయల పాతబకాయి జ్ఞాపకమొచ్చింది.

---

# స్వాగతము

## శ్రీ యక్కల వీరరాజు

హృదయపుష్పాన నీవు వర్షించియున్న
ప్రేమమధు విది పొంగిపొర్లెడిని దేవ!
భ్రమరమై వచ్చి, దివ్యసౌరభము లాని,
పాడు మొకపాట ప్రకృతి వైవశ్య మొంద!

వదనగగనాగ్రవీథికాపథములందు
హర్ష రేఖాపమోదము లాశ్రయించె;
నెమలివై వచ్చి, యీ రమణీయతఁ గని,
ఆడు మొక యాట మధురదృశ్య మ్మెసఁగ!

మానసోన్నతహిమవన్నగాన నుండి
నవ్యనవనీతభావజాహ్నవులు పాఱె;
హంసవై వచ్చి, తన్మృదులానిలోర్మి
నూఁగు మొకయూఁగు-అమరసాయుజ్యమంద!

కంఠవీణాస్వరాలు చక్కఁగ స్వనించి,
మధువు లూరించుచున్న యీ మధురవేళ
శ్రోతవై వచ్చి, తద్గానసుధల నాని,
కాంచు మొక నిద్ర తీయని కలలఁ దేల!

---